

అంతర్జాతీయ సైన్స్ ఫెస్ట్‌కు మిరియాల


ప్రజాశక్తి-విజయనగరం టౌన్



అంతర్జాతీయ సైన్స్ ఫిస్టివల్‌కు డాక్టర్ మిరియాల కృష్ణారావు ఎంపిక య్యారు. అంధ్రప్రదేశ్ రాష్ట్ర సైన్స్ ఉపాధ్యాయ ప్రతినిధిగా ఆయన వెళ్లనున్నారు. ఈ నెల 17నుంచి 20 వరకూ హర్యాన రాష్ట్రంలోని ఫరీదాబాద్‌లో ఈ ఫెస్ట్ జరుగుతుంది. అంధ్రప్రదేశ్ నుంచి సైన్స్ రంగంలో చేసిన కృషికి, నైపుణ్య అభవృద్ధికి ఈ అవకాశం కలిగింది. 17విభాగాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యువశాస్త్ర వేత్తల పరిశోధన పత్రాలను ఈ ఫెస్ట్‌లో సమర్పిస్తారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించే కార్యక్రమాలు, విద్యార్థి ప్రయోగ ప్రదర్శనలు ఉంటాయి. అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ సదస్సుకు హాజరవడం సంతోషకరంగా ఉందని కృష్ణారావు ప్రజాశక్తికి తెలిపారు.

చిన్న శ్రీనా?.. బెల్లానా?

విజయనగరం ఎమ్‌పి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖరా..? జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావా (చిన్న శ్రీను)?... ఇంతకీ ఎవరు? ఇదీ జిల్లాలో సాగుతున్న ఆసక్తికర చర్చ. తనకు సిఎం నుంచి హామీ ఉందని, తప్పకుండా తనకే సీటు దక్కుతుందని బెల్లాన చెబుతున్నారు. ఇప్పటికే చిన్న శ్రీనుకు ఎంపీ టిక్కెట్ ఖరారైందని ఆయన అనుచరులు, అభిమానులు చెప్పకుంటు న్నారు. అధిష్ఠానం మాత్రం సీటు కేటాయింపు విషయం వెల్లడించేందుకు తటపటాయిస్తోంది. ఇందుకు బలమైన కారణాలే కనిపిస్తున్నాయి.



- వైసిపి అభ్యర్థిత్వంపై ఉత్కంఠ
- ఎవరిని వదలుకున్నా పార్టీకి నష్టమే..!
- తటపటాయిస్తున్న అధిష్టానం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుతం ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో బొబ్బిలి మినహా పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. చిన్న శ్రీను ఈసారి ఎమ్మెల్యే లేదా ఎంపీగా పోటీచేయాలనే తలంపుతో ఉన్నారు. ముందు నుంచీ అనుకున్నట్టు బొబ్బిలిలో స్థానిక ఎమ్మెల్యేను మార్పుచేసినా సామాజిక సమీకరణాల నేపథ్యంలో చిన్నశ్రీనుకు అవకాశం ఉండదని చాలా కాలంగా చర్చనడుస్తోంది. ఈ నేపథ్యంలోనే చిన్న శ్రీనుకు ఎమ్‌పి సీటు కట్టబెడతారని ప్రచారం జరుగుతోంది. అలా అయితే సిట్టింగ్ ఎంపీ బెల్లాన భవితవ్యం ఏమిటి అనేది ప్రశ్న. వీరిద్దరిలో ఒకరికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే సీట్లు, మరొకరికి విజయనగరం ఎంపీ సీటు ఇస్తారని కూడా చర్చనడుస్తోంది. అటు ఎచ్చెర్ల స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ను ఈసారి పక్కనబెడితే ఈ ఫార్ములా బాగానే అమలు అయ్యే అవకాశం ఉంది. కానీ, కిరణ్‌ను తప్పనిసరిగా పక్కనబెడతారనేది సందేహమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో ఎంపీ సీటు యథాతథంగా బెల్లానకు ఇచ్చేస్తే చిన్న శ్రీను సంగతి ఎలా ఉంటుందనేది ప్రశ్న. చిన్న శ్రీను జిల్లాలో అన్నీ తానై వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఎంపీ టిక్కెట్ కట్టబెడితే అసెంబ్లీ స్థానాలన్నీ కలుపుకుని ఎన్నికల గట్టెక్కించేందుకు ప్రయత్నిస్తారని పార్టీ ఆలోచిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఈ విధంగా జిల్లా పార్టీకి నాయకత్వం వహిస్తున్న చిన్న శ్రీనుకి ఈ ఎన్నికల్లో సముచిత స్థానం కూడా కట్టబెట్టినట్టుగా ఉంటుందని పార్టీ యోచిస్తోంది. కానీ, బెల్లాన ప్రభావం చీపురుపల్లి నియోజకవర్గంతో ముడిపడి ఉంది. ఒక వేళ బెల్లానను పక్కనబెడితే ఎన్నికల్లో పార్టీకి పనిచేస్తారా? ప్రతిపక్ష పార్టీ ఏదైనా ఆఫర్ ఇస్తే అదే నియోజకవర్గం నుంచి మరోసారి ఎమ్మెల్యేగా తలపడుతున్న రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ పరిస్థితి ఎలా ఉంటుంది. ఈ కోణాల్లో పార్టీ ఆలోచిస్తున్నట్టు సమాచారం. మంత్రి బొత్స కూడా ఇదే సందేహంతో ఉన్నట్టుగా రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇలా ఓవైపు జిల్లాను ఏకతాటిపై నడిపిస్తున్న చిన్న శ్రీనుకి అవకాశం ఇవ్వాలా? లేక ప్రస్తుతం ధర్నాలు, నిరసనలతో ప్రభుత్వానికి ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఉద్యమాలను మాటలగారడితో చల్లారుస్తున్న సీనియర్ మంత్రి బొత్స భవితవ్యం చూడాలా? అన్నది వైసిపి అధిష్టానం ముందు ప్రస్తుతం సవాలుగా నిలిచింది. అందువల్లే అటు శ్రీకాకుళం ఇటు విశాఖపట్నం ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసి ప్రకటించినప్పటికీ విజయనగరం అభ్యర్థిని మాత్రం ప్రకటించలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

పోలింగ్ స్టేషన్ల కోసం పాఠశాలలు సిద్ధం చేయండి

15 రోజుల్లో పనులు పూర్తి కావాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

పోలింగ్ కేంద్రాలుగా వినియోగించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తూ పాఠశాలలను సిద్ధం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. పోలింగ్ బూత్‌లుగా వినియోగించేందుకు వీలుగా పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలను కల్పించడం, నాడూ-నేడు పనులపై కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ఆయా పాఠశాలల పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతీ పోలింగ్ కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపు, విద్యుత్ సదుపాయం, ఫర్నీచర్, సరైన నేమ్ బోర్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. జిల్లాలో మొత్తం 1847 పోలింగ్ కేంద్రాలకు 223 మంది సెక్టార్ అధికారులను నియమించామని, వారంతా ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించారని తెలిపారు. దీని ప్రకారం 397 పాఠశాలలకు ర్యాంపులు, 204 పాఠశాలలకు సరైన నేమ్ బోర్డులు, 83 పాఠశాలల్లో తాగునీటి సదుపాయం, 75 పాఠశాలలకు మరుగుదొడ్లు, 67 పాఠశాలల్లో ఫర్నీచర్, 27 పాఠశాలల్లో ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెప్పారు. వెంటనే పనులు ప్రారంభించి, 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

చాలా పాఠశాలల్లో ఇప్పటికే ఆర్‌ఒ ప్లాంట్లు, మరుగుదొడ్లు ఉన్నాయని, అవకాశం లేనిచోట తాత్కాలిక పద్దతిలోనైనా ఏర్పాటు చేయాలని సూచించారు. శాశ్వత అవసరాలకు వినియోగించేలా విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. చాలావరకు పోలింగ్ కేంద్రాలు పాఠశాలల్లోనే ఉన్నాయని, కేవలం 147 మాత్రమే ఇతర ప్రభుత్వ, ప్రభుత్వేతర భవనాల్లో ఉన్నాయని చెప్పారు. ఆయా భవనాలకు సైతం పూర్తిస్థాయిలో వసతులను కల్పించాలని ఆదేశించారు. నాడూ నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో, ఈ మేరకు మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, డిఇఒ లింగేశ్వరరెడ్డి, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డివిఇఒ భీమాశంకర్, ఎంఇఒలు, మండల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణ చట్టం పక్కాగా అమలు

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేదింపుల నిరోధక చట్టం అమలు పక్కాగా వుండాలని కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి చెప్పారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల చట్టంపై రూపొందించిన వార్షిక కేలండర్‌ను కలెక్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఇఒ లింగేశ్వరరెడ్డి, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఐసిడిఎస్. ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతకుమారి, కె.విజయ కుమారి, ఎస్.విద్య, పి. సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పంపుహౌస్ కార్మికులు

తక్షణమే బకాయి జీతాలివ్వాలి

- కార్పొరేషన్ కార్యాలయం గేటువద్ద బైఠాయింపు
- రాత్రి వరకూ కొనసాగిన పంపుహౌస్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నెల్లిమర్ల నగర ప్రజానీకానికి తాగునీరు అందిస్తున్న ముషిడిపల్లి, నెల్లిమర్ల, సారిపల్లి మాస్టర్ పంప్ హౌస్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వరకూ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ పంప్ హౌస్ కార్మికులకు 2022 ఏప్రిల్ ,మే సెప్టెంబర్ 2023 నవంబర్, డిసెంబర్ వేతనాలు, నెల్లిమర్ల పంప్ హౌస్ కార్మికులకు 2023 నవంబర్ ,డిసెంబర్ వేతనాలు, ముషిడిపల్లి పంప్ హౌస్ కార్మికులకు 2023 డిసెంబర్ నెల వేతనాలు బకాయిలు ఉన్నాయని, పండగ పూట జీతాలు చెల్లించకుండా కార్మికులను వారి కుటుంబాలను పస్తులు ఉంచడం భావ్యం కాదని అన్నారు. మొత్తం 70 మంది పంప్ హౌస్ కార్మికులకు 2023 జూన్‌లో పెరిగిన 2000 వేతనం కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జీతాలు చెల్లించకపోతే పంపింగ్ నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. రాత్రి 8 గంటల సమయంలో డిఇ అప్పారావు వచ్చి రెండు నెలల వేతనం ఇస్తామని ప్రకటించడంతో ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. ఆందోళనలో చందర్రావు, మురళి, నారాయణ రావు, అరుణ్, సత్యనారాయణ, రామ్మోహన్ నాయుడు, గౌరీ, లక్ష్మణరావు, సన్యాసిరావు బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్'లో బొబ్బిలికి రెండో ర్యాంకు

ప్రజాశక్తి-బొబ్బిలి

పాలిథీన్ నిషేధంలో రాష్ట్రానికే దిక్సూచిగా నిలిచిన బొబ్బిలి మున్సిపాలిటీకి రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరోసారి గుర్తింపు లభించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023-24 సంవత్సరానికి గాను రాష్ట్ర స్థాయిలో బొబ్బిలి ద్వితీయ స్థానంలో నిలిచింది. లక్ష లోపు జనాభా కలిగిన పురపాలక సంఘాలతో పోటీపడి సౌత్ ఇండియా స్థాయిలో ఎనిమిదో ర్యాంకు సాధించింది. ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించడం, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేసే ప్రక్రియ, చెత్త నుంచి సంపద సృష్టించడం, ట్విన్ బీన్స్ పద్ధతి అనుసరించడం, సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ, కాలువలో షిల్టు తొలగించడం, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్రస్థాయిలో బొబ్బిలి మున్సిపాలిటీకి ర్యాంకును కేటాయించారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రతిరోజు క్షేత్రస్థాయిలో వార్డుల్లో పర్యటించడం, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడంతోపాటు ప్రజల్లో చైతన్యం కలిగించేలా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో బొబ్బిలి మున్సిపాలిటీకి రెండో ర్యాంకు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. పట్టణ ప్రజలు, మున్సిపల్ కార్మికులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. వీరందరి సహకారంతోనే ఈ ర్యాంకు సాధించినట్లు ఆయన వివరించారు.

కలెక్టరేట్‌లో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కుల మతాలకు అతీతంగా అన్నివర్గాల హక్కుల కోసం, అభ్యున్నతి కోసం పాటుపడిన అంబేద్కర్ అందరివాడని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. సామాజిక సమతా సంకల్ప మహోత్సవంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో అవగాహనా సదస్సు ఘనంగా నిర్వహించారు. డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నాగలక్ష్మి, జె.సి మయూర్ అశోక్, దళిత నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత సమాచార శాఖ వారు అంబేద్కర్ జీవిత చరిత్ర పై ఏర్పాటు చేసిన ఫోటో ఎక్సిబిషన్ ను కలెక్టర్, జె సి సందర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఉద్యోగం కోసం ఉన్నత చదువులు చదవలేదని, విజ్ఞానార్జన కోసం, సమాజానికి తన చదువు ఉపయోగపడాలని చదివారని తెలిపారు. చదువే కాకుండా కుల, మత, రాజకీయ, ఆర్థిక అంశాల పై అనేక పుస్తకాలను రచించారని , విద్యార్థులు కొంత సమయాన్ని కేటాయించి వారి రచనలను చదవాలని, ప్రతి విద్యార్థి అంబేద్కర్ జీవిత చరిత్రను తెలుసుకోవాలని అన్నారు. సమావేశంలో ట్రైబల్ యూనివర్సిటీ ఆచార్య జితేంద్ర మోహన్, డివిఎంసి సభ్యులు జయరాజ్, భానుమూర్తి, శ్రీను, దళిత నాయకులు ఉదయ్ భాస్కర్, రామునాయుడు తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న విసి వెంకటసుబ్బయ్య

ఘనంగా జెఎన్‌టియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం గురజాడలో శుక్రవారం ఫార్మేషన్ డే వేడుకలు, జాతీయ యువజన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎపిఐటిఎ, డిజిటల్ మానిటరింగ్ సెల్, డిజిటల్ హబ్ సెంటర్ ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెఎన్‌టియు జివి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రారంభించి నేటికి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను యూనివర్సిటీలో నిర్వహించామని తెలిపారు.

అత్యంత శక్తివంతమైన మరియు అభివృద్ధి చెందిన యూనివర్సిటీగా తయారు చేయడానికి అందరి సహాయ సహకారాలు ఉండాలని కోరారు. యూనివర్సిటీ తరపునుంచి ఎల్ అండ్ టి లో ప్లేస్మెంట్ సంపాదించిన 26 మంది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఎపి ఇన్ఫరేషన్ టెక్నాలజీ అకాడమీ సిఇఒ డివి రామకోటిరెడ్డి మాట్లాడుతూ రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో జెఎన్‌టియుజివి బ్రాండెడ్ యూనివర్సిటీగా మార్పు చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయ సుమ మాట్లాడుతూ జెఎన్టియు జీవికి అనుబంధంగా ఆరు జిల్లాలో 33 కళాశాలల ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ వెబ్ సైట్ ను ప్రారంభించారు. డిజిటల్ హబ్ గోడ పత్రికను విడుదల చేశారు, కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ గురునాధ, పలు కళాశాలల డైరెక్టర్లు, ప్రిన్సిపళ్లు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం

సంతకాల సేకరణ ప్రారంభించిన అంగన్వాడీలు ● 32వ రోజుకు నిరవధిక సమ్మె





విజయనగరంలో సంతకాలు చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ; బొబ్బిలిలో అంగన్వాడీలకు మద్దతుగా సంతకం చేస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం దిగొచ్చేవరకు పోరాడాలని, అంగన్వాడీలకు అండగా ఉంటామని సిపిఎం, యుటిఎఫ్, సిఐటియు నాయకులు అన్నారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరంలోనూ సంతకాల సేకరణ చేపట్టారు. సమ్మెకు మద్దతు గా కోటి సంతకాల సేకరణను యుటిఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణంనాయుడు, సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టినా, ఎస్మా ప్రయోగించినా, రాత్రీ పగలు చలిలో దీక్షలు చేస్తూ 32 రోజులుగా పోరాడుతున్న అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని తక్షణమే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏరియాలో వాహనాలు మీద వచ్చిన వారి నుంచి, ప్రజల నుంచి సంతకాలు సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో యుటిఎఫ్ విజయనగరం మండల కార్యదర్శి రామకృష్ణ, గౌరవాధ్యక్షులు శ్రావణ కుమార్, జిల్లా కార్యదర్శి సత్యన్నారాయణ, సిఐటియు ఉపాధ్యక్షులు బి.సుధారాణి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : ఎస్మా ప్రయోగించిన తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదని అంగన్వాడీలు అన్నారు. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా సంతకాలు సేకరణ చేపట్టారు.అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు కృష్ణమ్మ, శ్రీలక్ష్మి, కొరలమ్మ, అనసూయతో పాటు డెంకాడ, భోగాపురం, పూసపాటి మండలాల్లోనే అంగన్వాడీలు, సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

బొబ్బిలి : అంగన్వాడీలకు యుటిఎఫ్ మద్దతు ప్రకటించింది. అంగన్వాడీలు చేపట్టిన కోటి సంతకాల సేకరణలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, తదితరులు సంతకాలు చేసి మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, నిర్మల పాల్గొన్నారు.

బాడంగి : బాడంగిలో అంగన్వాడీల సమ్మె శిబిరం శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్మా చట్టం జిఒ నంబరు 2 పత్రాలను మంటల్లో వేసి దహనం చేశారు.

గజపతినగరం : గజపతినగరంలో అంగన్వాడీలు సంతకాల సేకరణ చేపట్టారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షులు ఎం.సుబాషిణి, సెక్టార్ లీడర్లు రాములమ్మ, సుజాత, నరసమ్మ, రమణమ్మ, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.శ్రీనివాసరావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.శ్యామల, డి.జయలక్ష్మి, జి.క్రాంతి, వి.మాణిక్యం, డి.సుశీల, వి.దుర్గాలక్ష్మి పాల్గొన్నారు.



బాడంగి.. మంటల్లో ఎస్మా జిఒ కాపీలను దహనం చేస్తున్న అంగన్వాడీలు



శృంగవరపుకోట.. పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



పూసపాటిరేగ.. ర్యాలీ చేపడుతున్న అంగన్వాడీలు



నిరసన శిబిరం వద్ద పిండివంటలు వండుతున్న అంగన్వాడీలు

టెంట్లలోనే సంక్రాంతి వంటలు

ప్రజాశక్తి-మెరకముడిదాం

తమ న్యాయ మైన సమస్యలను వెంటనే పరిష్కరంచాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 32వ రోజుకు చేరుకుంది. సంక్రాంతి పండగ సమీపిస్తున్నా ముఖ్యమంత్రి జగన్ స్పందించి తమ సమస్యలు పరిష్కరించకపోవడంతో అంగన్వాడీలు సంక్రాంతి పండగను టెంట్లలోనే నిర్వహించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మెరకముడిదాంలో టెంట్లలోనే అంగన్వాడీలు సంక్రాంతి పండగకు సంబంధించి పిండివంటలు వండి నిరసన తెలిపారు. అంతేకాదు సంక్రాంతి ముగ్గులు వేయడం, గొబ్బిళ్లు పెట్టి నిరసన తెలిపారు. సమ్మె లోకి దిగాక క్రిస్టమస్‌ను, న్యూ ఇయర్‌ను టెంట్లలోనే జరుపుకున్నామని, తమ సమస్యలు పరిష్కారం కాకపోతే సంక్రాంతి పండగ కూడా పోరుబాటలో నడుస్తున్న టెంట్ల వద్దే జరుపుకొని తమ నిరసన తెలియజేస్తామే తప్ప వదిలేది లేదని అంగన్వాడీలు తెలిపారు. వెంటనే జగన్ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి సమ్మె ను విరమింపచేయాలని కోరారు. పోరాటాన్ని అణచివేయాలని చూస్తే సాధ్యం కాదని, ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టివి రమణ, ఎ.గౌరినాయుడు, ప్రాజెక్ట్ నాయకులు మాలతి, సావిత్రి, గౌరి, పద్మతో పాటు మండలంలో గల అంగన్వాడీలంతా పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు గంటారాజు మృతి

ప్రజాశక్తి-విజయనగరం కోట



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జమ్ము మాజీ సర్పంచ్ గంటా రాజు (జమ్ము రాజు) శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మృతికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. టిడిపి స్థాపించిన నాటి పార్టీ అభివృద్ధికి అయన విశేష కృషి చేసారని, కళారంగం పట్ల ఆయనకు ఎంతో ఆసక్తి ఉండేదని అన్నారు. సాంస్కృతిక విభాగ అధ్యక్షులు విజ్జపు ప్రసాద్ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేవరాజు గోపాలకృష్ణ కన్నుమూత

ప్రజాశక్తి -విజయనగరం కోట




ప్రముఖ సంగీత సాహిత్య, నాటకరంగ, సామాజిక సేవా ప్రియులు దేవరాజు గోపాలకృష్ణ గురువారం రాత్రి హైదరాబాద్‌లో తన కుమారుని వద్ద కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరు ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులలో ఒకరు. కౌముది పరిషత్, విజయభావన, వాగ్దేవి సమారాధనం, గాంధీ స్మారకనిధి మొదలైన సంస్థలలో సేవలందించారు. అనేకమంది రచయితలకు పుస్తక ముద్రణలో సహాయం చేశారు. ఆయన మృతి సంగీతం, సాహిత్య, సాంస్కృతిక రంగానికి తీరని లోటని ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వర రావు, డాక్టర్ ఎ. గోపాలరావు, కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, డాక్టర్ ఎ. రాఘవరావు, చాగంటి కొండలరావు, ధన్వాడ సుధాకర్, మోడేకుర్తి శ్రీనివాసరావు, టి.మహేశ్వరరావు పేర్కొన్నారు.

నేడు మండల స్థాయి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పుణ్యగిరి ప్రయివేటు డిగ్రీ కళాశాల ఆవరణంలో మండల స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు మంగరాజు తెలిపారు, పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. మండలంలో ఆసక్తిగల మహిళలు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.



కళ్లద్దాలు అందజేస్తున్న లలితకుమారి

కళ్లద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎన్‌టిఆర్ సేవాసమితి ట్రస్టు, ఎంవివిఎస్ మూర్తి ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేసుకున్న వారికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారి కళ్లద్దాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ముఖ్యమంత్రి ఏవో మాయమాటలు చెప్పి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారే తప్ప ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం లేదన్నారు. గ్రామాల్లో విలేజ్ క్లినిక్ పెట్టారు కానీ వాటిలో అందుబాటులో ఏ ఒక్క వైద్యుడు లేరని చెప్పారు. వాలంటీర్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించడం ఎంతవరకు ప్రజల ఆరోగ్యానికి మంచిదో ఒక్కసారి ప్రజలంతా ఆలోచించుకోవాలని కోరారు.

డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు

పాత పింఛను అమలు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు పాత పింఛను అమలు చేయాలని ఎపిటిఎఫ్ (257) జిల్లా నాయకులు జె.సి.రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో శుక్రవారం జిల్లా గౌరవాధ్యక్షులు బి.జోగినాయుడు అధ్యక్షతన డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 10 రాష్ట్రాలలో డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు పాత పింఛను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2018 నుంచి ఇప్పటి వరకు బకాయి పడ్డ 12 విడతల కరువుభత్యం, సరెండర్ లీవ్స్, ఉద్యోగ విరమణ బకాయిలు, ఇతర బకాయిలు రూ.32 వేల కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో పని చేస్తున్న గెస్ట్ టీచర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. నాయకులు జి.చంద్రినాయుడు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. మున్సిపాలిటీలో గొల్లపల్లిలోని పదో వార్డులో శుక్రవారం రాష్ట్రానికి మళ్లీ జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, వైసిపి నాయకులు తిరుపతి, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి స్టాల్ ప్రారంభం

కొత్తవలస : స్థానిక వైకెపి కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సంక్రాంతి స్టాల్‌ను పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, ఎంపిడిఒ వై.పద్మజ కలిసి ప్రారంభించారు. ఈ స్టాల్స్‌లో కొత్తవలస రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం (ఎఫ్‌పిఒ) ద్వారా భోగి, సంక్రాంతి పండగకు అవసరమయ్యే ఆవు పిడకలు, నలుగు పిండి, వేప పుల్లలు, ఆర్గానిక్ ద్వారా పండించే వంకాయలు, టమోటాలు, గుమ్మడికాయలు, ఆనపకాయలు, ఎర్ర దుంపలు, చిక్కుడు కాయలు విక్రయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఒ ప్రెసిడెంట్, ఎపిఎంలు ఎ.వెంకటరమణ, జి.శ్రీనివాసరావు, సిసిలు అప్పలస్వామి, సన్యాసి పాల్గొన్నారు.

నేడు వాజీ ఆధ్వర్యాన రంగోలీ పోటీలు

విజయనగరం కోట : సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందజేయడమే లక్ష్యంగా వాజీ ఛానల్ గత 28 సంవత్సరాలుగా రంగోలి పోటీలను నిర్వహిస్తూ వస్తోందని వాజీ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 13న ఆనందగజపతి ఆడిటోరియంలో రంగోలి పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రూ.4.50లక్షల విలువగల బహుమతులను విజేతలకు అందిస్తామన్నారు. ఈ పోటీలలో ముగ్గు వేసే ప్రతి ఒక్కరికి పలు బహుమతులు ఇస్తామని తెలిపారు.

ఆదర్శ ప్రాయుడు.. స్వామి వివేకానంద

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ● పలుచోట్ల జయంతి వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజ హితాన్ని కాంక్షించే స్వామి వివేకానందుడి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. శుక్రవారం జాతీయ యువజనోత్సవాల సందర్భంగా పాల్ నగర్ లో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, జోనల్ ఇన్చార్జి డాక్టర్ వి ఎస్ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ దాసరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నేటి యువతకు స్వామి వివేకానంద ఆదర్శం

విజయనగరం : నేటి యువతకు స్వామి వివేకనందుడు ఆదర్శనీయమని మాతృభూమి సేవా సంఘం అధ్యక్షులు గెద్ద చిరంజీవి అన్నారు. మాతృభూమి సేవా సంఘం, నెహ్రూ యువ కేంద్రం, యువజన సర్వీసులు శాఖ ఆధ్వర్యంలో కనపాక యూత్ హాస్టల్ నందు జరిగిన స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం రక్తదానం చేపట్టారు. వివేకనందుడ్ని నేటి యువత ఆదర్శంగా తీసుకొని మంచి మార్గంలో నడుస్తూ సమాజ అభివద్ధికి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో రామా నాయుడు, తాడేపల్లి నాగేశ్వరరావు, ఐ గోపాలరావు మాట్లాడారు.



వేపాడ : నివాళులర్పిస్తున్న జగ్గయ్యపేట గ్రామస్తులు

యువజన దినోత్సవం

డెంకాడ : ఎంవిజిఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాలలో, జిల్లా గ్రంథాలయ ఆవరణలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేశారు. పాఠశాల విద్యార్థులకు, యువతకు వివేకానంద పుస్తకాలను పంపిణీ చేశారు. కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్.షణ్ముఖరావు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వంటాకు శ్రీను, రావాడ రామ సత్యం, రావాడ వెంకటరావు, గొర్లె అవతారం, రంగళి సత్తిబాబు, మహిళా కోలాట భజన గురువు, యువకులు పాల్గొన్నారు.



వివేకానందుని విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

మనో ధైర్యంతో ముందుకు సాగాలి

వికలాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పిలుపునిచ్చారు. వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వారికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనోధైర్యాన్ని కోల్పోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని అన్నారు.

ఇదే నా చివరి మీటింగ్

మండల సమావేశంలో ఎమ్మెల్యే కడుబండి

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేసిన ప్రసంగం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదే తన చివరి సమావేశమని ఎమ్మెల్యే చెప్పడంతో అక్కడున్న సభ్యులంతా కంగుతిన్నారు. ఎందుకలా చెప్పారో అర్థం కాక వారిలో వారు గుసగుసలాడుకున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇళ్ల స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి, స్థలాన్ని కేటాయించాలని తహశీల్దార్ కృష్ణ ప్రసాద్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కొంతమంది సర్పంచులు మాట్లాడుతూ సమగ్ర భూ సర్వేలో తయారుచేసిన పట్టాదారు పాస్ పుస్తకాలు వాలంటీర్ల చేతికి ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. అలాంటప్పుడు సర్పంచులుగా తమకు ఉన్న విలువ ఏమిటని నిలదీశారు. సమావేశంలో ఎంపిపి డి.సత్యవంతుడు, డిసిసిబి చైర్మన్ వి.చిన్నరామినాయుడు, జెడ్‌పిటిసి ఎస్.అప్పలనాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సన్యాసినాయుడు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు ఎన్.వెంకట్రావు, తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఉమ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-రామభద్రపురం

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందని డిఎంహెచ్‌ఒ భాస్కరరావు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బూసాయవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భరోసా ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆసుపత్రులకు పంపి వైద్య సౌకర్యం అందేటట్లు చూస్తున్నామని తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన శస్త్రచికిత్సలకు చేసి, కళ్లద్దాలు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమామణి, ఆరికతోట పిహెచ్‌సి వైద్యాధికారి అపర్ణ, వైద్యులు అర్చనాదేవి, రెడ్డి, త్రినాథ్, ఇఒ మల్లికేశ్వరరావు, పిహెచ్‌ఎ పద్మ, పంచాయతీ కార్యదర్శి పి.పార్థసారథి, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి హైమావతి, పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

మైత్రీ మీడియా ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంక్రాంతి సంబరాలలో భాగంగా జి.టి.పి.ఎల్ మైత్రీ మీడియా ఛానెల్, ఎస్బార్ షాపింగ్ మాల్ సంయుక్తంగా స్థానిక గురజాడ కళాభారతిలో వైభవంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వందలాది మంది మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మూడు గంటల నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ పోటీలకు ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు ప్రెసిడెంట్ కాపుగంటి సుధ, సభ్యులు ఉమా, బాలాజీ, లక్ష్మి శ్రీనివాస్, మానస, విశాలి, లత జడ్జ్ లుగా వ్యవహరించి విజేతలను ప్రకటించారు. విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు ప్రధానం చేసారు. రంగోలి పోటీల్లో మొదటి బహుమతిగా ఆర్. శారద బంగారు నక్లెస్, రెండవ విజేతగా సిత కుమారి చెవి దిద్దులు, మూడవ బహుమతిగా మణి 43ఇంచిల స్మార్ట్ టివి సొంతం చేసుకున్నారు. ట్రెజర్ హంట్ కార్యక్రమంలో మూడు వెట్ గ్రైండర్లు, మూడు వాటర్ ప్యూరిఫైయర్లు, ఎయిర్ కూలర్, వాషింగ్ మిషన్, 32 ఇంచ్ టివి, 43 ఇంచ్ టివి లను బహుమతులుగా అందించారు. విజేతలకు ఎఎస్‌పి ఆస్మా ఫర్హీన్, జిటిపిఎల్ మైత్రీ మీడియా డైరెక్టర్లు అవనాపు విక్రమ్ సీతారామరాజు, ముదునూరి నకుల్ వర్మ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిటిపిఎల్ మైత్రీ మీడియా డైరెక్టర్ ఆవనాపు విక్రమ్, మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ, వాటిని భావితరాలకు అందజేయాలన్న లక్ష్యంతో రంగోలి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

బొబ్బిలి : ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో బి.జోగినాయుడు, జెసి రాజు, జి.చంద్రినాయుడు.. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్నేహ చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి మరిశర్ల కృష్ణమూర్తి నివాళులర్పించారు. తారకరామ కాలనీలో షైనింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి నిర్వహించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎఎస్‌పి ఆస్మాఫర్హీన్, అవనాపు విక్రమ్

ఆరోగ్య సురక్షకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని అంబఖండి గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి హేమ సుందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. జిఎంఆర్ కేర్ వైద్యులు శైలజ, జె.ఎం.ప్రవీణ్‌కుమార్, పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు సిహెచ్. సురేష్.. శిబిరంలో 410 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఒకరిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఇఒ రాధాకృష్ణ, పిహెచ్‌ఎన్ సావిత్రి, హెల్త్ సూపర్వైజర్ సాయి ప్రసాద్, హెచ్‌వి లక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ విభాగం అదనపు గదులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో కమ్యూనికేషన్ విభాగానికి నిర్మించిన అదనపు గదులను ఎస్‌పి ఎం.దీపిక శుక్రవారం ప్రారంభించారు. కమ్యూనికేషన్ విభాగంలో పనిచేసే మహిళా సిబ్బంది వేచి ఉండేందుకు, కమ్యూనికేషన్ విభాగం పరికరాలు ఉంచేందుకు స్టోర్ రూమ్ అవసరమరని తెలపడంతో రెండు గదులను శ్రమదానంతో నిర్మించి అందుబాటులోకి తెచ్చారు.

నెలాఖరులోగా టిడ్కో గృహాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో 1.50 లక్షల టిడ్కో గృహ ప్రవేశాల్లో భాగంగా ఈనెలాఖరు నాటికి నగరంలో 2112 ఇళ్ల పంపిణీ చేపడతామని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. సారిపల్లిలో 1024 ఇళ్ళ,సోనియానగర్ లలో నిర్మిస్తున్న 1088 ఇళ్లు పంపిణీ చేస్తామన్నారు. తమ సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నగరంలో సారిపల్లిలో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి ప్రభుత్వం నిర్దేశించిన ఒక లక్షా యాభై వేల ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జ్యోతి, డిఇఇ తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు గట్టుపై గాంధీ విగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్టేట్ బ్యాంక్ ప్రధాన బ్రాంచ్ ఎదురుగా పెద్ద చెరువు గట్టుపై గాంధీ విగ్రహం ఏర్పాటుకు పనులు చురుకుగా సాగుతున్నాయి. పనులను మున్సిపల్ ఇంజినీర్ దక్షిణామూర్తి, డిఇ రామసుబ్బారావు పరిశీలించారు. ఈనెల 30న గాంధీ వర్ధంతి సందర్భంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతున్న గాంధీ విగ్రహం చుట్టూ స్మృతి వనం మాదిరిగా తయారు చేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎంఇ దక్షిణామూర్తి మాట్లాడుతూ విగ్రహం చుట్టూ స్మృతి వనం మాదిరిగా తయారు చేసి సాయంత్రం పూట విగ్రహం వద్ద కూర్చొని సేద తీరే విధంగా సుందరంగా తయారు చేస్తామని తెలిపారు.

తిరుమల మెడికవర్‌లో అధునాతన స్కానింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

సేవా దృక్పథం కలిగిన వైద్యులకు సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. శుక్రవారం తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన అధునాతన స్కానింగ్ పరికరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలకు తిరుమల ఆసుపత్రి అధునాతన వైద్య పరికరాలతో అత్యవసర వైద్య సేవలను సైతం అందించడం హర్షణీయమన్నారు. వైద్యులు కేవలం వ్యాపార దృక్పథం కాకుండా సేవా నిరతి జోడించి సేవలు అందించడం ద్వారా సమాజంలో మరింత పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆసుపత్రిని ఆధునికరిస్తూ ప్రజలకు మెరుగైన ఆధునిక వైద్య సేవలు అందించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఎం.డి.డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ కృష్ణ శాంతి, ఆసుపత్రి సెంటర్ హెడ్ పద్మ కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్ మహేష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్ కుమార్ పాత్రో, డాక్టర్ పిఎస్‌వి రామారావు, కె.దివ్య తదితరులు పాల్గొన్నారు.



స్కానింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

'వైసిపి నాయకులకు మతి భ్రమించింది'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో జరిగిన యువగళం, రా..కదిలి రా సభలకు హాజరైన ప్రజానీకాన్ని చూసి వైసిపి నాయకులు మతిభ్రమించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. శుక్రవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ ఓటమి తప్పదనే భయంతో వైసిపి నాయకులు కులాల మధ్య చిచ్చు రేపుతున్నారని ఆరోపించారు. 2004లో కాంగ్రెస్ హయాంలో సాంబశివరాజు, శత్రుచర్ల , సుజయ్ పోటీ చేసినప్పుడు బిసిలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు బిసిలకు అన్యాయం జరుగుతోందని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. నిజంగా బిసిలపై ప్రేమ వుంటే విజయనగరం నియోజకవర్గంలో బీసీలకు సీటు ఇచ్చే దమ్ము వుందా అని ప్రశ్నించారు. బొబ్బిలి నియోజకవర్గంలో బేబీనాయన పై పోటీ చేయాలని సవాల్ చేశారు.

చురుగ్గా సాగుతున్న జెజెఎం పనులు

వేపాడ : మండలంలోని 24 పంచాయతీల్లో ఇంటింటికీ తాగునీరు అందించే ఉద్దేశంతో రూ.5.34 కోట్లతో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. శుక్రవారం కె.జి.పూడి పంచాయతీ పరిధిలోని కోటయ్యగరువు, చిట్టివానిపాలెం, బంగారయ్యపేట గ్రామాల్లో చేపడుతున్న పనులను ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.పైడిరాజు పరిశీలించారు. ఉగాదికి పనులు పూర్తవుతాయని ఆయన తెలిపారు.

'కొప్పల వెలమకు ప్రాధాన్యత కల్పించాలి'

ప్రజాశక్తి-బొబ్బిలి

రాజకీయ పార్టీలు కొప్పల వెలమ సామాజిక తరగతికి సముచిత స్థానం కల్పించాలని కొప్పల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు బొమ్మినేని తిరుపతినాయుడు డిమాండ్ చేశారు. వెలమ భవనంలో శుక్రవారం కొప్పల వెలమ సంక్షేమ సంఘం కేలండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్ర వ్యాప్తంగా కొప్పల వెలమలకు రాజకీయ పదవులలో ప్రాధాన్యత ఇచ్చే వారని, ఇటీవల కాలంలో ఇవ్వడం లేదని చెప్పారు. తమకు ప్రాధాన్యత ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

బొబ్బిలిరూరల్ : మండలంలోని పారాదిలో మన ఊరు-మన ఆట కార్యక్రమాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, నాయకులు బంటుపల్లి దివ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు వీరమహిళ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీరాజ్ బహుమతులు ప్రదానం చేశారు.

నేరాలు ఘోరాలు

కొండగండ్రేడులో మహిళ హత్య

భర్తే కాలయముడు

ప్రజాశక్తి-గుర్ల

మండలంలో కొండగండ్రేడు గ్రామంలో గురువారం సాయంత్రం మహిళ హత్యకు గురైంది. కట్టుకున్న భర్తే కాలయముడే కాటేస్తాడని ఊహించని మహిళ చివరికి ప్రాణాలు కోల్పోయింది. సిఐ ఉపేంద్రరావు కథనం ప్రకారం...

కొండగండ్రేడు గ్రామానికి చెందిన మునకాల సత్యం, లక్ష్మి (45) దంపతులు. వీరికి కుమార్తె జ్యోతి, కుమారుడు గణేష్ ఉన్నారు. గురువారం సాయంత్రం కళ్లంలో వ్యవసాయ పనులు చేస్తుండగా దంపతులిద్దరూ గొడవపడ్డారు. ఎప్పుడూ అప్పులు చేసి, తమకు, పిల్లలకు ఎలాంటి ఆదరవూ లేకుండా చేస్తున్నావంటూ లక్ష్మి మందలించే ప్రయత్నం చేసింది. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో దగ్గరలో ఉన్న కర్రతో సత్యం ఆమెను కొట్టాడు. తల వెనుక భాగంలో తగలడంతో లక్ష్మి అక్కడికక్కడే పడిపోయింది. దగ్గరకు వెళ్లి చూడగా మృతి చెందింది. దీంతో మృతదేహంపై సత్యం గడ్డి కప్పేసి వెళ్లిపోయాడు. రాత్రి 8 గంటల సమయంలో మద్యం సేవించి, గ్రామానికి చేరుకుని తన భార్యను హత్య చేసినట్లు గ్రామస్తులకు చెప్పాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కళ్లానికి వెళ్లి చూసి, పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో గుర్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం చీపురుపల్లి సిఐ ఉపేంద్రరావు అక్కడికి చేరుకుని, శవ పంచనామా చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి సిహెచ్‌సికి తరలించారు. సత్యం పరారీలో ఉండటంతో గాలిస్తున్నట్లు సిఐ తెలిపారు.



మృతిచెందిన లక్ష్మి (ఫైల్)

70 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రామతీర్థం , కుమిలి జంక్షన్ వద్ద అసిస్టెంట్ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ డి .శైలజ రాణి సమక్షంలో ఎస్ఐ జిఎస్ఎన్ రాజశేఖర నాయుడు, సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవుని కనపాక, పకీర్ కిత్తలిలో దాడులు చేపట్టారు. దేవుని కణపాకలో 70 లీటర్ల సారా, 15 కేజీల బెల్లం, 10కేజీల అమోనియాతో ఒక్క వ్యక్తిని అరెస్ట్ చేసి నెల్లిమర్ల స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ రాజశేఖర్‌నాయుడు మాట్లాడుతూ సారా, అక్రమ మద్యం పట్టుకునేందుకు దాడులు చేసి పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు.